రైతుల శ్రేయస్సే ప్రధానం

- గడువు లోగా వ్యాపారులు ఆక్రమణలు లేకుండా చూడాలి
- నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి


గాంధీగంజ్‌లో పర్యటిస్తున్న చైర్మన్, పాలక వర్గ సభ్యులు

సుభాష్‌నగర్ కూరగాయల రైతుల శ్రేయస్సే తమకు ముఖ్యమని నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని గాంధీ గంజ్‌లో కూరగాయల రైతులకు ప్లాట్ ఫామ్‌లను కేటాయించారు. చైర్మన్ పాలకవర్గ సభ్యులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, తహసీల్దార్లు, మార్కెట్ కమిటీ అధికారులతో కలిసి గాంధీ గంజ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. గతంలో రైతుల పంటలను ఆరబెట్టేందుకు వ్యాపారులకు ఈ స్థలాన్ని కేటాయించారని తెలిపారు. ఇప్పుడు తమ స్థలమని వ్యాపారులు అనడం సమంజసం కాదన్నారు. వ్యాపారులు ఆ స్థలాలను మార్కెట్ కమిటీకి స్వచ్ఛందంగా అప్పగించాలని సూచించారు. వ్యాపారుల విజ్ఞప్తి మేరకు కొంత సమయం ఇస్తామని, గడువులోపు ఆక్రమణలు లేకుండా చూడాలన్నారు. కూరగాయల రైతులకు ప్రయోజనం చేకూరేలా పాలకవర్గం చర్యలు చేపడుతుందన్నారు. ఆయన వెంట సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ అపర్ణ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్, టీపీవో ప్రదీప్ కుమార్, నార్త్, సౌత్ తహసీల్దార్లు, గ్రేడ్-3 సెక్రటరీ మధుసూదన్, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

క్లుప్తంగా

మహా ధర్నాను విజయవంతం చేయాలి



ధర్పల్లి: సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ పీఆర్టీయూ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్ లోని ఇందిరా పార్క్‌లో నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకట రాజారెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో మహాధర్నా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సతీశ్ కుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నరేశ్, నాయకులు లింగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రవిరాజ్, ప్రసన్నకుమార్, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో మెరుగైన వైద్యం అందించాలని వినతి

సిరికొండ: మండలంలోని చీమన్‌పల్లికి చెందిన సారంపల్లి ప్రసాద్ అనే యువకుడు ఈ నెల 10న గల్ఫ్ దేశం బహ్రెయిన్‌లో పని చేస్తుండగా భవనం పై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రసాద్‌కు మెరుగైన వైద్యం అందించాలని అతని అక్క నూగూరి లత హైదరాబాద్ ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన 'సీఎం ప్రవాసీ ప్రజావాణి'లో వినతి పత్రం అందించారు. ప్రసాద్‌కు మెరుగైన చికిత్స అందించాలని, అనంతరం స్వదేశానికి రప్పించాలని ఆమె కోరారు. ఆమె వినతి మేరకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తగిన సహకారం అందించాలని తెలంగాణ ఎన్నారై సలహా కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డిని ఆదేశించారు. ప్రభుత్వ ఖర్చులతో చికిత్స చేయించి, స్వదేశానికి తీసుకువచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆమెకు హామీ ఇచ్చారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ రూరల్ : మండలంలోని ఆకుల కొండూర్ శివారులో ఉన్న కేజీబీవీలో పని చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దీపికరాణి మంగళవారం పేర్కొన్నారు. ఇద్దరు వంట మనుషులు, మరొకరు నైట్ డ్యూటీ వర్కర్‌గా పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి పూర్తయి ఉండాలని, స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. అభ్యర్థులు ఈ నెల 21లోగా దరఖాస్తులను పాఠశాలలో అందించాలన్నారు. మరిన్ని వివరాలకు 6300 241936 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

సిరికొండ: మండలంలోని పోత్నూర్ గ్రామంలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. గ్రామంలో 90 కార్డులు మంజూరైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దర్శనం మంజుల, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గాండ్ల నర్సయ్య, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, దశరెడ్డి, నర్సయ్య, గంగాధర్, లింగన్న, సురేందర్‌రెడ్డి, వినోద్, పంచాయతీ కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి రెండు రోజుల జైలు

ఖలీల్‌వాడి: మద్యం తాగి స్థానికులకు ఇబ్బందుకు కలిగించిన ఓ వ్యక్తికి, పోలీసు విధులకు ఆటకం కలిగించిన మరో వ్యక్తికి జిల్లా కోర్టు రెండు రోజుల జైలుశిక్ష విధించింది. వివరాలు ఇలా.. నగరంలోని ఇంద్రాపూర్‌కు చెందిన ఆలకొండ గంగప్రసాద్ ఇటీవల మద్యం తాగి స్థానికులను ఇబ్బందులకు గురిచేశాడు. అలాగే నగరంలోని శాంతినగర్‌కు చెందిన రిజ్వాన్ మద్యం తాగి డయల్ 100కు ఏడుసార్లు కాల్ చేసి పోలీస్ విధులకు ఆటంక కలిగించాడు. దీంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేసి మంగళవారం ఇద్దరిని మార్నింగ్‌కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	101,100	వెండి(కిలో)	1,20,000
22 క్యారెట్స్	93,332	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	28	50	గాజరుగడ్డ	30	60
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	30	60
జీరకాయ	25	50	దోసకాయ	15	30
దొండకాయ	25	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	50	90	గోబిగడ్డ	15	30
కాకరకాయ	25	50	గోబిపువ్వు	25	50
వంకాయ	15	30	బీట్‌రూట్	30	60
పాలకూర	40	80	కరివేపాకు	40	80
మెంతికూర	40	80	చామగడ్డ	30	60
కొత్తిమీర	30	60	చిక్కుడుకాయ	20	40
పుదీనా	40	80	గోరుచిక్కుడు	30	60
క్యాప్సికం	25	50			

-సుభాష్‌నగర్

ఉర్దూ టీచర్లకు అవార్డులు


ఉపాధ్యాయుడికి అవార్డు అందజేస్తున్న ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో ఉత్తమ ఉర్దూ టీచర్లకు అవార్డులను అందజేశారు. వారిలో జిల్లా నుంచి 18 మంది టీచర్లు ఎంపికయ్యారు. మోస్రా పాఠశాలకు చెందిన సర్వర్ హైమద్ జిల్లా కేంద్రంలోని సతీశ్‌నగర్‌కు చెందిన ఎండీ ఫజుల్లా ఖాన్, మక్బూల్ హుస్సేన్, ఆర్మూర్ బాలుర పాఠశాలకు చెందిన అస్త నసీమ్, మాక్లూర్ పాఠశాలకు చెందిన అంజాద్ ఉల్లా, జిల్లా కేంద్రంలోని వెంగళరావునగర్ కాలనీకి చెందిన మహమ్మద్ అబ్దుల్ అలీమ్, జిల్లా కేంద్రంలోని ఎంఏ అలీం, డిచ్‌పల్లి పాఠశాలకు చెందిన హుస్సేనీ బుఖారి, జానకంపేట పాఠశాలకు చెందిన మీర్జా అసన్ బేగ్, ఆర్మూర్‌లోని జిరాయత్ పాఠశాలకు చెందిన సాదియా తబస్సుం, జిల్లా కేంద్రంలోని హబీబ్ నగర్ పాఠశాలకు చెందిన మహమ్మది షాహీన్, సాటాపూర్ పాఠశాలకు చెందిన ఫౌజియా తస్లీమ్, ఫతేపూర్ పాఠశాలకు చెందిన అల్తాఫ్ ఉద్దీన్ ఫర్వేజ్ ఉన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని వాటర్‌ట్యాంక్ పాఠశాలకు చెందిన రఫియా సుల్తానా, పోతంగల్ పాఠశాలకు చెందిన అబ్దుల్ ఖాదర్, కసాబ్‌గల్లి పాఠశాలకు చెందిన రజియా సుల్తానా, రుద్రూరు పాఠశాలకు చెందిన సయ్యద్ యూసుఫ్, సాటాపూర్ పాఠశాలకు చెందిన సిద్ధికి బేగం టీచర్లు అవార్డులు అందుకున్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

జానపద కళలను రక్షించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సిర్ప లింగం

నిజామాబాద్ రూరల్: మన సంస్కృతిలో జానపద కళలు ప్రధాన భాగమని, ఆచార వ్యవహారాలకు అద్దం లాంటివని వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిజామాబాద్ సాంస్కృతిక కళా వేదిక జిల్లా అధ్యక్షుడు సిర్ప లింగయ్య అన్నారు. నగరంలోని ఖలీల్‌వాడీలో ఉన్న పెన్షనర్స్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ జానపద కళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 23న నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో జానపద కళా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జానపద నృత్యాలు, సింధు, ఒగ్గు, కోలాటం, భజన, సుమారు 150 మంది కళాకారులతో కళా ప్రదర్శనలు నిర్వహిస్తామని అన్నారు. జానపద కళల రక్షణ కోసం కృషి చేస్తున్న వారికి అవార్డులు అందిస్తామన్నారు. ప్రభుత్వం ప్రజా కళలను రక్షించాలని, కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పేద కళాకారులకు చేయూతనివ్వాలని ఆమర కోరారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ దాసు, ప్రధాన కార్యదర్శి అబ్దుల్, సాయిబాబా, గంగాధర్, రాధా కిషన్, నర్సారెడ్డి, చంద్రశేఖర్, పురుషోత్తం, విజయమాల, అంజన్న, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రో కబడ్డీ పోటీలకు సురేశ్ ఎంపిక



ఇందల్వాయి : డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న ఇందల్వాయి తండాకి చెందిన బానోత్ సురేశ్ తెలంగాణ ప్రో కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ రాజ్ కుమార్ మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లో ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 5 వరకు నిర్వహించే ఈ పోటీల్లో సురేశ్ పాల్గొంటాడని అన్నారు. సురేశ్‌కి గతంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న అనుభవం ఉందని ఆయన తెలిపారు. అనంతరం సురేశ్‌ను కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లింగయ్య, ప్రధాన కార్యదర్శి గంగాధర్‌రెడ్డి అభినందించారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన



మోపాల్: మండలంలోని సిర్పూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఎంఈవో గేమ్‌సింగ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారి సామర్థ్యాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని ఎంఈవో సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్నిరకాల వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు రాము, వసంత, గంగాప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



మోపాల్: మండలంలోని కులాస్‌పూర్ గ్రామానికి చెందిన వరుణ్ అదృశ్యమైనట్లు ఎస్సై జాడె సుస్మిత మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్డేపల్లి గంగాధర్ మనవడు బొద్దుల వరుణ్ డిచ్‌పల్లి ఎస్సీ హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల సెలవుల కారణంగా 14న కులాస్‌పూర్ వచ్చాడు. తిరిగి 18న హాస్టల్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిపోయాడు. కానీ వరుణ్ హాస్టల్‌కు వెళ్లలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. వరుణ్ ఆచూకీ తెలిసిన వారు 8712659850 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న రూరల్ సీఐ సురేశ్‌కుమార్

నిజామాబాద్ రూరల్: మండలంలోని 19 గ్రామాలతో పాటు నాలుగు డివిజన్లలో ఉన్న వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని రూరల్ సీఐ సురేశ్‌కుమార్, ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ సూచించారు. మంగళవారం గూపన్‌పల్లి పరిధిలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్‌హాల్‌లో 150 మంది గణేశ్ మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండపాల వద్ద డీజేలను ఏర్పాటు చేయరాదని, సౌండ్ సిస్టం కూడా రాత్రి 10గంటలలోపు నిలిపివేయాలని సూచించారు. మండపాల వద్ద ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండపాల నిర్వాహకులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సిరికొండలో..

సిరికొండ: గణేశ్ మండపాల నిర్వాహకులు తగిన నిబంధనలు పాటించాలని ఎస్సై రామకృష్ణ సూచించారు. నిర్వాహకులతో మండల కేంద్రంలో ఎస్సై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సౌకర్యం కోసం అనుమతి పొందాలని, ఆ శాఖ సిబ్బంది ద్వారానే విద్యుత్ సౌకర్యాన్ని పొందాలన్నారు. సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని, డీజేలను పెట్టవద్దని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల బదిలీలు నిలిపివేయాలి



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏల బదిలీలను నిలిపివేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు సబ్బని లత డిమాండ్ చేశారు. మంగళవారం బల్దియా కార్యాలయం ఎదుట మహిళా వీఆర్‌ఏలు నిరసన కార్యక్రమం చేపట్టారు. వీరికి బీఎల్‌టీయూ నాయకురాలు సబ్బని లత మద్దతు పలికారు. వీఆర్‌ఏలు రెండేళ్లుగా ఇంజినీరింగ్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్నారని, వారిలో 15 మందిని శానిటేషన్ విభాగానికి అధికారులు మార్చారన్నారు. తిరిగి వారిని యథాస్థానంలోనే కొనసాగేలా చూడాలని కోరారు. నాయకులు మేకల రాజేందర్, అనిల్ కుమార్, ఎస్.మంజుల, దేవమ్మ, నర్సుబాయి, సురేఖ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బీఎన్‌ఆర్‌కేఎస్ నాయకులు


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు చంద్రం, నాయకులు

నిజామాబాద్ నాగారం : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి, లేబర్ కమిషనర్ గంగాధర్‌ను భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు హైదరాబాద్‌లో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్మికుల సమస్యలపై వారితో చర్చించినట్లు నాయకులు తెలిపారు. సమస్యలపై మంత్రి, కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు రూ. పది లక్షలు, సాధారణ మృతికి రూ. రెండు లక్షలు, అంగవైకల్యం కలిగిన వారికి రూ. మూడు లక్షల నిధులను ప్రభుత్వం ద్వారా వెల్ఫేర్ బోర్డు నుంచి అందేలా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. అలాగే కార్మికులకు పింఛన్ రూ. ఐదు వేలు, భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్ అందించాలని మంత్రి, కమిషన్‌ను కోరినట్లు తెలిపారు. అనంతరం మంత్రి, కమిషనర్‌కు వేర్వేరుగా నాయకులు వినతిపత్రాలను అందజేశారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెలిమిల రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సరే కల్వర్టులు ఏవి?


సిరికొండ అటవీ ప్రాంతంలో విస్తరించిన రోడ్డు


కల్వర్టు నిర్మించాల్సిన ప్రదేశం

- సిరికొండలో కల్వర్టుల వద్ద గుంతలుగా మారిన రోడ్డు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

సిరికొండ : అంతర్ జిల్లా రహదారిని విస్తరించినా, అటవీ ప్రాంతంలో శిథిలావస్థకు చేరిన కల్వర్టుల వద్ద నూతన వంతెనలు నిర్మించక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ వెళ్లే మార్గంలో సిరికొండ అటవీ ప్రాంతంలో గత రెండేళ్ల క్రితం సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించారు. మార్గ మధ్యంలో ఉన్న శిథిలావస్థకు చేరిన కల్వర్టులను తొలగించి నూతన కల్వర్టులను నిర్మించలేదు. అటవీ ప్రాంతంలో వర్షానికి కురిసిన వరద నీరు పల్లపు ప్రదేశంలోకి వెళ్లడానికి రోడ్డు దాటే ప్రాంతంలో ఒర్రెల వద్ద కల్వర్టులు ఉన్నాయి. ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా సింగిల్ లేన్‌తో వాటిని నిర్మించారు. రోడ్డు విస్తరణ కోసం ఆర్‌అండ్‌బీ శాఖ రూపొందించిన ప్రతిపాదనల్లో నూతన కల్వర్టుల నిర్మాణాలను చేర్చకపోవడంతో కల్వర్టుల నిర్మాణాలకు నిధులు మంజూరు కాలేదు. దీంతో మార్గమధ్యలో ఉన్న కల్వర్టులను నిర్మించలేదు. ఆ కల్వర్టుల వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో నిలిచిన నీటితో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

ఈ మార్గం గుండా మండల పరిధిలోని పందిమడుగు, చీమన్‌పల్లి, దుప్య తాండ, తాటిపల్లి గ్రామాలతో పాటు పలు తండాలకు చెందిన ప్రజలు నిత్యం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. వేములవాడ పుణ్యక్షేత్రానికి ఈ మార్గం చాలా దగ్గరవుతుండటంతో భక్తులు ఎక్కువగానే వెళ్తుంటారు. కల్వర్టుల వద్ద రోడ్డు బాగా లేకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల పాత కల్వర్టుల పైనుంచే రోడ్డును విస్తరించారు. కల్వర్టు అంచుల వరకు రోడ్డును వేసి అక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. శిథిలావస్థకు చేరిన కల్వర్టుల స్థానంలో నూతన వంతెనలను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

24న ఆలయ అర్చకుల అభినందన సభ


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

నిజామాబాద్ రూరల్ : బ్రాహ్మణ సంక్షేమ వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఆలయ అర్చకుల అభినందన సభను నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న గీతా భవన్‌లో నిర్వహించనున్నట్లు కేంద్ర కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్. యుగంధర్ తెలిపారు. నగరంలోని గీతాభవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలోని అన్ని ఆలయాల అర్చకులను ఒకే వేదికపై తీసుకొచ్చి అందరిలో ఐక్యమత్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు వేదిక వ్యవస్థాపకుడు బాల శ్రీనివాస్, పలు రాష్ట్రాల నాయకులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సభను ఆలయ అర్చకులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మేడిచర్ల ప్రభాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు జనగామ చంద్రశేఖర శర్మ, తెలంగాణ కమిటీ ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్ సుబేదార్, తెలంగాణ కమిటీ సంయుక్త కార్యదర్శి రణదీశ్ శర్మ, కార్యవర్గ సభ్యులు వెంకటరమణ, రొట్టె సురేశ్ పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులతో ప్రిన్సిపాల్ నళిని, ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి: రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో మండలంలోని సుద్దపల్లి శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెల 16 నుంచి 18వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు మంచి ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించిందన్నారు. ఈ విజయంలో సుద్దపల్లి గురుకుల కళాశాల క్రీడాకారిణులు చక్కని ప్రతిభ చూపారని, విద్యార్థిని లిఖిత బెస్ట్ క్యాచర్ అవార్డు అందుకున్నారని తెలిపారు.

క్రీడాకారిణులను ప్రిన్సిపాల్ నళినితో పాటు సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, పీఈటీ లు జ్యోత్స్న, నర్మద, అకాడమీ కోచ్ మౌనిక, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

వ్యాపారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి


ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

నిజామాబాద్ రూరల్: వినాయక చవితి సందర్భంగా చిరువ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ఠాకూర్, సభ్యులు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ సభ్యులు మాట్లాడుతూ.. వినాయక చవితిని పురస్కరించుకొని చిరు వ్యాపారులు నగరంలోని పెద్దబజార్‌లో ఉన్న హెడ్‌పోస్టాఫీసు నుంచి ఆర్‌ఆర్‌ఎస్ చౌరస్తా వరకు వినాయక విగ్రహాలు, పూజాసామగ్రి, పువ్వులు, పండ్లు అమ్ముకునే చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. భారీ వాహనాలను ఆ రోడ్డు గుండా అనుమతించకుండా ఉండాలని ఏసీపీని కోరారు. కులమతాలకు అతీతంగా చిరు వ్యాపారస్తులు వ్యాపారం చేసుకుంటు ఆ మార్గంలో దుకాణాలను పెట్టి జీవిస్తారని ఏసీపీ దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా వినాయక, దుర్గామాత నిమజ్జనం వరకు ఆ రోడ్డు గుండా ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలను అనుమతించకుండా తగు చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఏసీపీకి విన్నవించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సహ కార్యదర్శి దాత్రిక రమేశ్, శ్రీనివాస్, సతీశ్, సభ్యులు ఉన్నారు.

సమాచారం..

నియామకం



డిచ్‌పల్లి: వరంగల్ జిల్లాలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ దేశ్‌పాండే నియామకమయ్యారు. ఈ మేరకు బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరు రామేశ్వర్ రావు చేతుల మీదుగా ప్రవీణ్ నియామకపత్రం అందుకున్నారు. జిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ ప్రస్తుతం బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రవీణ్ కు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, బ్రాహ్మణులు అభినందనలు తెలిపారు.

పేదలకు అండగా ఉంటాం


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నిజామాబాద్ సిటీ: పేదలకు ఎర్రజెండా ఎప్పుడూ అండగా ఉంటుందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు, నగర కార్యదర్శి సుజాత అన్నారు. జిల్లా కేంద్రంలోని నాగారం దొడ్డికొమురయ్య కాలనీలో సీపీఎం నాయకులు మంగళవారం పర్యటించారు. స్థానికులతో కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేదల గుడిసెలు తొలగిస్తామని అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని స్థానికులు వారి దృష్టికి తీసుకొచ్చారు. తమలో చాలా మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వాటిని నిర్మించుకుంటామంటే ఫారెస్టు అధికారులు అభ్యంతరం చెబుతున్నారన్నారు. పేదల భూమిపై అధికారుల దౌర్జన్యం తగదని రమేశ్‌బాబు అన్నారు. కార్యక్రమంలో రాములు, అనిత, యశోద, రజియా, సంగీత, లక్ష్మీబాయి, రమాబాయి, గోదావరి బాయి, జై శ్రీ, మంగళ బాయి, దీక్షిత పాల్గొన్నారు.